# ★ తెల్లవారుజామున కల ★

రచన: శ్రీ పి. వీరన్న

అది ఒక పెంకుటిల్లు. దాని యజమాని శంకరం తన తల్లి సుబ్బమ్మ, భార్య శారదలతో అందులో ఉంటున్నాడు. చేస్తున్నది గుమాస్తా ఉద్యోగమవడంచేత అంతంత కొంప తమ ముగ్గురికే ఎక్కువని తలచి ఇంటిని రెండు భాగాలుగా విభజించి అవతలి వైపు భాగం విశ్వనాథంగారికి అద్దెకు ఇచ్చాడు. ఆతని భార్యపేరు అన్నపూర్ణమ్మ. ప్రక్కప్రక్కన ఉండటముచేత వారూ వీరూ కలసీ మెలసీ ఉంటున్నారు. ఇలా ఉండగా ఒక రోజున ఏమయినదంటే—!

ఆరోజున ఆడవాళ్ళ విశ్రాంతికాలమప్పుడు అనగా 2-30 గంటలకు అలవాటు ప్రకారం సుబ్బమ్మగారి కేక కాలాన్ననుసరించి అన్నపూర్ణమ్మకు వినబడింది. "ఏమండోయ్ అన్నపూర్ణమ్మగారూ! రండీ అప్పడాలు వేసికొందాము" అవతలివైపు నుండి అన్నపూర్ణమ్మగారి జవాబు ఇట్లా వినబడింది. "ఆ, ఆ! వస్తున్నానండీ. మీకోసమే ఎదురు చూస్తున్నానండీ". "త్వరగా వచ్చెయ్యండీ" అని సుబ్బమ్మగారు తన సరంజామా అంతా ఏర్పాటు చేసుకోవడం కోసం లోపలికి వెళ్ళింది. అత్తగారి అలవాట్లను తెలిసికొన్న కోడలు ఆమె రాకముందే అన్ని ఏర్పాట్లూ చేసి అత్తగారి రాక కోసం ఎదురు చూస్తున్నది. ఇంతలో అత్తగారు, సామానుతో సహా ప్రక్కనే వుంటున్న అన్నపూర్ణమ్మగారూ రానే వచ్చారు. సుబ్బమ్మగారూ అన్నపూర్ణమ్మగారూ కలసి అప్పడాలు వత్తుతూ బాతాఖానీకబుర్లు మొదలు పెట్టారు. శారద ప్రక్కనేకూర్చుండి వింటూవుంది. "ఏమిటండీ విశేషాలు?" అని అడిగింది అన్నపూర్ణమ్మ. "అబ్బే? మీకు తెలియనివి ఏమున్నవండీ? వాటికేంకాని నాకు మాత్రం భలే కలవచ్చిందండీ రాత్రి." అన్నది సుబ్బమ్మ. "ఏమిటండోయ్ అది? మాకు కొంచెము చెప్పండీ వింటాము" అని నవ్వుతూ అడిగింది అన్నపూర్ణమ్మ. చెప్పమన్నట్లు శారద అత్తగారివైపు చూసింది. "మా అబ్బాయి శంకరంలేడూ! వాడికి లాటరీలో 50000 రూపాయిలు వచ్చినట్లూ, మా అబ్బాయీ, కోడలూ, ఇదిగో ఇదే" అని శారదవైపు చూపగానే "పోండి అత్తయ్యా" అని సిగ్గుపడింది శారద. వెంటనే తన కల గురించి చెప్పడము మొదలుపెట్టింది సుబ్బమ్మ "వీళ్ళిద్దరూ కలసి విమానంలో బొంబాయి వెళ్ళినట్లూ, కారులో ఆ నగరమంతా తిరిగినట్లూ, చివరకు సముద్రపొడ్డుపై కూర్చొని కబుర్లు చెప్పుకొంటున్నట్లు కలవచ్చిందండీ. అదీకాక ఈసంధ్య మా అబ్బాయి లాటరీలకు డబ్బు కట్టానే వున్నాడండీ. ఆహాహా! ఆ నగరం ఎంత బాగున్నదనుకున్నారూ. ఇంకా ఏంజరిగేదో కానీ, ఈలోగా పాలమనిషి వచ్చి లేపేశాడు". అని అనగానే "ఓహో! మీకు కల తెల్లవారుఝామున వచ్చినదన్నమాట, అయితే తప్పకుండా నిజమవుతుందండీ. తెల్లవారిఝామున వచ్చిన కలలు తప్పకుండా నిజమవుతాయట" అన్నది అన్నపూర్ణమ్మ. ఈ మాటలను విన్న శారద ఆనందతరంగిణిలో ఓలలాడింది, ఒకవేళనిజంగా అట్లా జరుగుతుందేమో అనే ఆశ ఆమెలో పెనవేసుకు పోయింది. శారద ఊహా లోకంలో పడింది. మిగిలిన ఇద్దరూ ఏవో కబుర్లలో పడిపోయారు. కాని అవేం శారద చెవికెక్కడములేదు.

ఇంతలో "అమ్మా! కాఫీ అయిందా?" అన్న శంకరం కేక విని సుబ్బమ్మగారు కాఫీ కలపడానికి వెళ్ళిపోయింది. కొంతసేపయిన తరువాత శారద కాఫీ తీసుకు వెళ్ళి భర్తకిచ్చి "ఏమండీ, మరేం మీఅమ్మగార్కి వచ్చిన కలవిని ప్రక్కింటావిడ 'నిజమవుతుంది' అని అన్నదండీ అనగానే "ఏమిటది?" అని ప్రశ్నించాడు శంకరం. కల సంగతంతా భార్యవలన విని "భలేగావుందే" అని నవ్వుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు శంకరం.

ఆ రాత్రి బొంబాయి ఊహల్లోపడి చాలాసేపటివరకూ శారద నిద్రపోలేదు. కొత్త ఫాషన్ల చీరలు, ఎత్తుబూట్లూ, రిష్టువాచీలు, చలవకళ్ళజోళ్ళ ఊహలలోపడి చాలసేపటివరకూ నిద్రపోలేదు. ఎలాగో ఆరాత్రంతా మంచముమీద గడిపేసి నెమ్మదిగా 2-30 గంటలకు నిద్రాదేవి ఒడిలోనికి జారింది. కొంతసేపయిన తరువాత "అయ్యో అత్తయ్యో, అత్తయ్యో" అని గట్టిగా ఏడ్వడం మొదలు పెట్టింది. ప్రక్కనే వున్న శంకరం నిద్రనుండి గాభరాగాలేచి "ఏమిటే శారదా ఏడుస్తున్నావు?" అనగానే ఏడుస్తూనే "టైము ఎంతయిందండీ?" అని అడిగింది. ఏడుపుకు కారణం ఏమిటో అర్థంకాక 4-30 అయింది అని జవాబిచ్చాడు శంకరం. అయినా తన ఏడ్పు మానలేదు శారద. ఇంతలో ఆ ఏడుపు విని సుబ్బమ్మ, అన్నపూర్ణమ్మ, ఆమె భర్త విశ్వనాథం అక్కడకు వచ్చారు "ఎందుకే ఏడుస్తున్నావు?" అని సుబ్బమ్మగారు అడుగగా ఇంకా గట్టిగా ఏడవసాగింది శారద. ఫరవాలేదని ధైర్యం చెప్పి "ఫర్వాలేదు చెప్పమ్మా" అని అన్నపూర్ణమ్మ అడిగింది. ఏడుస్తూనే జవాబిచ్చింది శారద. "అదికాదండీ మావారూ, నేనూ కలసి బొంబాయిలో తిరుగుతూ వుండగా మా అత్తగారు మాకోసం బొంబాయివచ్చి కారు ప్రమాదంలో చచ్చిపోయినట్లు కల వచ్చినదండీ" అన్నది "పిచ్చిపిల్లా కలవచ్చినంతమాత్రాన ఏడుస్తారా" అని అన్నపూర్ణమ్మ అనగానే "అదికాదండీ నిన్న మీరు అన్నారుగా తెల్లవారు ఝామున వచ్చిన కల నిజమై తీరుతుందని. ఏడుపొచ్చిందండీ" అనిఅంది శారద, దానితో అందరికీ నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

———o———